

# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త

## నోటీసులిచ్చినా బేఖాతర్..

# అక్రమాలపై పంజా



వెంచర్‌లో ప్లాట్ల గుర్తింపు బోర్డులను తొలగిస్తున్న పంచాయతీ రాజ్ శాఖ అధికారులు

**★అక్రమ ఫామ్ ల్యాండ్ వెంచర్లు కూల్చివేత ★వార్త వరుస కథనాలతో కదిలిన పంచాయతీరాజ్ అధికారులు ★ఎనిమిది ఎకరాల్లో దందాకు చెక్**

**ధారూర్, మే 18, ప్రభాతవార్త:** ధారూర్ మండలం రాజాపూర్ గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా, ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వెలిసిన అక్రమ ఫామ్ ల్యాండ్ వెంచర్‌పై పంచాయతీ రాజ్, ఇరిగేషన్ శాఖ అధికారులు ఎట్టకేలకు కొరడా ఝుళిపించారు. సాగునీటి కాలువను కబ్జా చేసి, దర్జాగా సాగిస్తున్న ఈ అక్రమ దందాపై వార్త దినపత్రికలో వచ్చిన వరుస కథనాలకు స్పందించిన ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో కఠిన చర్యలకు ఉపక్రమించారు. మొదటగా ఇరిగేషన్ శాఖ అధికారులు రంగంలోకి దిగి, సాగునీటి కాలువను ఆక్రమించి అక్రమంగా వేసిన దారిని, పైపులను పూర్తిగా తొలగించారు. ఆ తర్వాత కూడా రియల్టర్లు ప్రభుత్వ ఆదేశాలను, నోటీసులను బేఖాతరు చేస్తూ పనులను కొనసాగించడంతో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. సోమవారం సదరు ఫామ్ ల్యాండ్ వెంచర్ స్థలానికి చేరుకున్న అధికారులు, అక్కడ అక్రమంగా వెలిసిన లేఅవుట్ నిర్మాణాలను, బోర్డులను పూర్తిగా కూల్చివేశారు. మొత్తం 8 ఎకరాల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఈ దందా సాగుతున్నట్లు అధికారులు నిర్ధారించారు. గతంలోనే పంచాయతీ రాజ్ పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, రియల్టర్లు వెనక్కి తగ్గకపోవడంతోనే ఈ కూల్చివేతలు చేపట్టినట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులను, కాలువలను కబ్జా చేస్తే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు. కూల్చివేతలు పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ ఉన్నారు.



రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

# దౌల్తాబాద్‌లో రైతుల ధర్నా

### తూకాల్లో తరుగుపై సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం

**దౌల్తాబాద్, మే 18, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం, గన్నీ సంచుల కొరతను నిరసిస్తూ దౌల్తాబాద్ మండల కేంద్రంలో రైతులు, బిఆర్ఎస్ ముఖ్య నేతలు రోడ్డుపైకి వచ్చి భారీ ధర్నా నిర్వహించారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా రహదారిపై బైఠాయించడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి,ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై రైతులు, నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**ఒక్కో సంచికి రూ.50 వసూళ్లా!**

ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచుల కొరత సృష్టించి, ఒక్కో సంచికి రూ.50 వరకు వసూలు చేయడం దారుణం అని అన్నారు. దీనికి తోడు క్వింటాకు ఏకంగా 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల పొట్ట కొడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే రైతులు తీవ్ర ఇబ్బందులు పడటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి కొడంగల్ రైతులకు తక్షణమే న్యాయం చేయాలని, లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

**తూకాల్లో దోపిడి ఆపాలి: ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి**

ఉమ్మడి పాటమూరు జిల్లా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ...వడ్లు కొనుగోలులో జాప్యం ఎందుకని రైతుల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యానికి సరిపడా గన్ని బ్యాగులు ఇవ్వకపోవడంతో దుర్మార్గమన్నారు.పూర్తిగా ఎండిన ధాన్యం కల్లాలలోనే ఉండడంతో, అక్కడక్కడా అకాల వర్షంతో ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**ప్రతి గింజ కొనాలి**

ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి గింజను కొనుగోలు చేయాలని, తూకంలో ఎటువంటి దోపిడి జరగకుండా కొనుగోలు చేసి, మద్దతు ధరతో కలిపి రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్,మాజీ వైస్ ఎంపీపీ మైపాల్‌రెడ్డితో పాటు మండలంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,ఆయా గ్రామాల ముఖ్య నాయకులు, రైతులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

# తరుగు కోస్తే తాట తీస్తాం

**ఒక్క కిలో కూడా అదనంగా కట్ చేయొద్దు**

**రైతుల దోపిడిని సహించేది లేదు**

**మిల్లర్లకు కలెక్టర్ దీపక్ తివారీ తీవ్ర హెచ్చరిక**

**మిల్లుల తనిఖీలో వెలుగు చూసిన అక్రమాలు**



మిల్లులో తనిఖీ చేస్తున్న దీపక్ తివారీ

**దౌల్తాబాద్, మే 18, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడితే ఎంతటి వారైనా సహించేది లేదని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపసక్ తివారీ అధికారులను హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో.. ఎస్పీ స్నేహ మెహ్రా, ఆర్టీఓ అనిత, జిల్లా అధికారులతో కలిసి సోమవారం దౌల్తాబాద్ మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను, ధాన్యం నాణ్యతను తనిఖీ చేసిన అనంతరం, సమీపంలోని ప్రైవేటు రైస్ మిల్లులలో కూడా అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. క్వింటాలు ధాన్యానికి నిబంధనల ప్రకారం కంటే ఎక్కువగా తరుగు తీస్తున్నట్లు కలెక్టర్ దీపక్ తివారి గుర్తించారు. ఈ దోపిడిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి వచ్చిన రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పీఏసీఎస్ సెంటర్ నిర్వాహకులపై, బాధ్యులైన అధికారులపై కలెక్టర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నిబంధనలకు మించి రైతుల నుంచి ఒక్క కిలో కూడా అదనంగా తరుగు తీయడానికి వీల్లేదు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించడానికి వెనువెంటనే లారీలను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు.అదే విధంగా కేంద్రాలలో గన్ని బ్యాగుల కొరత లేకుండా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కడ అధికారి వెంక టర్రెడ్డి, దౌల్తాబాద్ తహసీల్దార్ గాయత్రి, మండల పరిధిలోని వివిధ శాఖల అధికారులు, పీఏసీఎస్ కేంద్ర నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌కు



# కొత్త రెక్కలు

**విమానాశ్రయంలో సరికొత్త కార్గో టెర్మినల్2 షురూ!**

**ఏడాదికి 50 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం**

**భవిష్యత్‌లో లక్ష మె.టన్నులకూ విస్తరించుకునే అవకాశం**

**అత్యాధునిక టెంపరేచర్ కంట్రోల్ సౌకర్యంతో ప్రత్యేక ఫార్మా జోన్**

**ప్రాణరక్షణ, అత్యవసర మందుల రవాణా మరింత వేగవంతం**

**ప్రాంతీయ ఆర్థికవృద్ధికి సరికొత్త మైలురాయి**

**అంతర్జాతీయ ప్రమాణాలతో సేవలందించనున్న జీఎంఆర్**

**శంషాబాద్, మే 18, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రపంచ స్థాయి ఎయిర్ కార్గో లాజిస్టిక్స్ హబ్‌గా మరో కీలక మైలురాయిని అధిగమించింది. జీఎంఆర్ హైద రాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సోమవారం ఇక్కడ సరికొత్త, అత్యాధునిక కార్గో టెర్మినల్2ను అధికారికంగా ప్రారంభించింది. 16,864 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ టెర్మినల్, ప్రారంభంలో ఏడాదికి 50,000 మెట్రిక్ టన్నుల కార్గోను చేరవేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. భవిష్యత్తులో దీనిని 1,00,000 మెట్రిక్ టన్నుల వరకు విస్తరించుకోవచ్చు.

హైదరాబాద్‌ను గ్లోబల్ ఫార్మా హబ్‌గా మరింత బలోపేతం చేసేందుకు, ఇందులో అత్యాధునిక టెంపరేచర్ కంట్రోల్డ్ (ఉష్ణోగ్రత నియంత్రణ) కలిగిన ప్రత్యేక ఫార్మా జోన్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ప్రాణాలు రక్షించే అత్యవసర మందులు, త్వరగా పాడైపోయే వస్తువులను సురక్షితంగా రవాణా చేయవచ్చు.

**వేగవంతమైన సేవలు**

ఎయిర్‌లైన్స్, లాజిస్టిక్స్ ఆపరేటర్లు, రెగ్యులేటరీ సంస్థలకు ఎలాంటి అంతరాయం లేకుండా, కస్టమ్స్ క్లియరెన్స్‌లు వేగంగా జరిగేలా డిజిటల్, భౌతిక మౌలిక వసతులను ఇక్కడ కల్పించారు. కార్గో టెర్మినల్ 2 ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిహెచ్ ఐఎల్ సిఇవో కదిర్ కదిరవన్ మాట్లాడుతూ.. హైద రాబాద్‌ను ఆసియాలోనే అత్యుత్తమ లాజిస్టిక్స్ గేట్‌వేగా నిలబెట్టడంలో ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సేవలను అందించడానికి దోహద పడుతుందన్నారు. జీఎంఆర్ ఏరో కార్గో లాజిస్టిక్స్ సీఈఓ సంజీవ్ ఎడ్వర్డ్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత ఆర్థిక వృద్ధికి, వివిధ పరిశ్రమల ఉత్పత్తులను దేశ విదేశాలకు సులువుగా, వేగంగా రవాణా చేయడానికి ఈ సేవలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

## ఇంట్లో చెప్పిందేమో వైజాగ్ ప్రయాణం

# చేరింది ఫామ్‌హౌస్ మృత్యుకుహరం!

**స్విమ్మింగ్ పూల్‌లో పడి యువకుడు మృతి ✦మొయినాబాద్ శివారులో విషాదం**

**మొయినాబాద్, మే 18 ప్రభాతవార్త:** అది ఆదివారం ఉదయం.. "స్నేహితులతో కలిసి విశాఖపట్నం వెళ్తున్నా" అని ఇంట్లో వాళ్లకు చెప్పి ఆ యువకుడు సంతోషంగా బయలుదేరాడు. కొడుకు దూర ప్రయాణం వెళ్తున్నాడనే భావనతో ఆ కుటుంబ సభ్యులు కూడా సాధారణంగానే వీడ్కోలు పలికారు. కానీ, అదే అతను తమతో మాట్లాడే చివరి మాటలవుతాయని, ఇక ఎప్పటికీ తిరిగి రాడని ఆ కుటుంబం ఊహించలేకపోయింది. అబద్ధం చెప్పి వెళ్లిన ప్రయాణం.. ఆ యువకుడి జీవితాన్నే ముగించేస్తుందని అనుకోలేదు. క్షణకాలం పాటు జరిగిన ఒక ప్రమాదం, ఆ ఇంట్లో ఎప్పటికీ నిండని తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లిలోని మసీద్ బండకు చెందిన కోడిచెర్ల సాయికుమార్ (28) కొండాపూర్‌లోని కెనరా బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం వైజాగ్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పిన సాయికుమార్, సాయంత్రం వచ్చేసరికి మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి శివారులో ఉన్న వయాన్ ఫామ్‌హౌస్‌కు చేరుకున్నాడు. అక్కడ అతని స్నేహితులు ఏర్పాటు చేసిన పార్టీలో పాల్గొన్నాడు.



మృతుడు సాయికుమార్

**నవ్వుల మధ్యన ముంచేసిన విషాదం**

స్నేహితులంతా కలిసి ఎంతో హుషారుగా, సంతోషంగా గడుపుతున్న సమయమది. ఒకరినొకరు పలకరించుకుంటూ, నవ్వుకుంటూ పార్టీ చేసుకుంటున్న తరుణంలో ఊహించని ప్రమాదం జరిగింది. అందరితో కలిసి ఉన్న సాయికుమార్ ప్రమాదవశాత్తు అక్కడే ఉన్న స్విమ్మింగ్ పూల్లో పడిపోయాడు. అది గమనించిన తోటి స్నేహితులు వెంటనే అప్రమత్తమై అతనిని పూల్ నుంచి బయటకు తీశారు. శ్వాస ఆగిపోతుండటంతో కంగారుగా స్థానిక భాస్కర్ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే కాలం మించిపోయింది. సాయికుమార్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఎంతో సంతోషంగా సాగాల్సిన స్నేహితుల పార్టీ.. క్షణాల వ్యవధిలో శ్మశాన వైరాగ్యాన్ని మిగిల్చింది.

సోమవారం తెల్లవారుజామున సుమారు 4:27 గంటల సమయం. గాఢనిద్రలో ఉన్న సాయికుమార్ సోదరుడు ప్రభాస్ ఫోన్ మోగింది. అవతలి వైపు నుంచి సాయికుమార్ స్నేహితుడు జావిద్ వణుకుతున్న స్వరంతో మాట్లాడాడు. సాయికుమార్ స్విమ్మింగ్ పూల్లో పడి మృతి చెందాడని, ప్రస్తుతం శవం భాస్కర్ ఆసుపత్రిలో ఉందనే చేదు నిజాన్ని మోసుకొచ్చాడు. ఆ వార్త వినగానే ప్రభాస్ గుండె ఒక్కసారిగా ఆగిపోయినంత పనైంది. నమ్మలేక, గుండె నిండా ఆందోళనతో వెంటనే భాస్కర్ ఆసుపత్రికి పరుగు తీశాడు. అక్కడ చేతన లేకుండా పడి ఉన్న తన సోదరుడి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యాడు. ఒకవైపు 28 ఏళ్ల వయసులోనే ఉద్యోగం చేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్న యువకుడు ఇలా అకాల మరణం చెందడం ఆ కుటుంబంలో తీరని శోకాన్ని నింపింది. మృతుడి సోదరుడు ప్రభాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

**సమస్యల పరిష్కారం.. అభివృద్ధిపై దృష్టి సారించండి**

**అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశం**

**జిల్లా అంతటికీ సమాన ప్రాధాన్యం ఇస్తానని ఎమ్మెల్యేలకు హామీ**



జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డి.శ్రీధర్‌బాబు, ప్రభుత్వ చీఫ్ విప్ పి.మహేందర్‌రెడ్డి, కలెక్టర్ మనుచౌదరి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 18, ప్రభాతవార్త :** ప్రజలకు అధికారులు జవాబుదారీగ ఉండాలని, జిల్లాలో ఉన్న సమస్యల పరిష్కారంకు నిర్మాణాత్మక ఆలోచనలతో వాటి పరిష్కారానికి కార్యచరణలతో సంబంధిత అధికారులు కృషి చేయా లని, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు అభివృద్ధిలో సమాన ప్రాధాన్యత ఇస్తానని జిల్లా ఎమ్మెల్యేలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తాను సమీక్ష సమావేశాలకు రాకున్నా కలెక్టర్ ద్వారా అభివృద్ధి పనులు కొనసాగుతాయని, ప్రభుత్వం చేపట్టిన 99రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అభివృద్ధికి దోహదపడుతుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగింది. దీనిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పి.మహేందర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే ఎం.కృష్ణారావు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ మనుచౌదరి, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ వినయ్‌కృష్ణారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్‌లు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేశ్, మున్సిపల్ చైర్మన్లు కె.శిరీషకృష్ణారెడ్డి, జాము రవి, శ్రీదేవి, మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, మున్సిపల్స్ జోనల్ కమిషనర్లు, పలువురు సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు. పలు శాఖలకు సంబంధించి సమస్యలు, అభివృద్ధి, ప్రగతికి సంబంధించి అంశాల శాఖల వారీగ సమీక్షించారు. జిల్లాలో 16వేల రేషన్‌కార్డులు కొత్తవి పెండింగ్‌లో ఉన్నందున వెంటనే వెరిఫికేషన్ చేసి జూన్ 2వ తేదీలోపు ఎంపిక చేయాలని మంత్రి డిఎస్‌ఓను ఆదేశించారు. కొత్తవి రేషన్‌కార్డులు ఇవ్వటం లేదని, కొత్త రేషన్‌షాపులు ఏర్పాటు కూడ నిర్లక్ష్యం చేస్తున్నారని మిగతా 3లో

## టాస్క్‌ఫోర్స్

# మెరుపు వేట

### ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ల దందా గుట్టురట్టు

- రంగారెడ్డి జిల్లాలో ఆకస్మిక సోదాలు
- రూ.50 వేల విలువైన 173 ఇంజెక్షన్లు స్వాధీనం
- ప్రధాన నిందితుడి అరెస్ట్

**పశువుల నుంచి ఆక్రమంగా, అధికంగా పాలు పిండేందుకు ఉపయోగించే ప్రాణాంతక, నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ల అక్రమ రవాణా గుట్టును శంషాబాద్ జోన్ కమిషనరేట్ టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ఈ ఇంజెక్షన్లు తరచూ ఇవ్వడం వల్ల మూగజీవాలలో సంతానోత్పత్తి సమస్యలు, గర్భాశయ ఒత్తిడి, మాస్టిటిస్ వంటి భయంకరమైన వ్యాధులు వస్తాయి. ఈ పాలు తాగే మనుషుల్లో (ముఖ్యంగా పిల్లల్లో) హార్మోన్ల అసమతుల్యత, అకాల యుక్తవయస్సు, గర్భిణులలో తీవ్ర ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.**




ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి నిషేధిత ఇంజెక్షన్లను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

**రంగారెడ్డి అర్బన్, మే 18, ప్రభాతవార్త:** శంషాబాద్ జోన్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పశువుల నుంచి అక్రమంగా అధికంగా పాలు పిండేందుకు ఉపయోగించే నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ల అక్రమ రవాణా గుట్టును రట్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన అత్తేని కృష్ణను అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి సుమారు రూ.50 వేల విలువైన 173 ఆక్సిటోసిన్ ఇంజెక్షన్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని మంఖాల్ గ్రామానికి చెందిన అత్తేని కృష్ణ డైరీ ఫారమ్ నిర్వహించడంతో పాటు తుక్కుగూడలో శ్రీకృష్ణ క్యాటిల్ ఫీడ్ పేరుతో పశుగ్రాసం దుకాణం నిర్వహిస్తున్నాడు. సుమారు ఐదేళ్ల క్రితం గుజరాత్‌కు చెందిన ఖాలెద్ అలీ అలియాస్ చత్రు సింగ్‌తో పరిచయం ఏర్పడగా, అతని ద్వారా నిషేధిత ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లను తక్కువ ధరలకు కొనుగోలు చేయడం ప్రారంభించాడు. ఈ ఇంజెక్షన్లను స్థానిక డైరీ ఫారమ్ నిర్వాహకులకు ఒక్కో బాటిల్‌ను రూ.250 నుంచి రూ.300 వరకు విక్రయిస్తూ అక్రమ లాభాలు ఆర్జిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. తుక్కుగూడకు చెందిన సురేష్ అనే డైరీ నిర్వాహకుడు కూడా కృష్ణ వద్ద నుంచి తరచూ ఈ ఇంజెక్షన్లను కొనుగోలు చేసి పశువులకు వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. విశ్వసనీయం సమాచారం మేరకు దాడి చేసిన శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం, నిందితుడిని అదుపులోకి తీసుకుని 173 ఇంజెక్షన్ బాటిళ్లను స్వాధీనం చేసుకుంది.

స్వాధీనం చేసుకున్న ఇంజెక్షన్ల మొత్తం పరిమాణం 43.250 లీటర్లుగా అధికారులు తెలిపారు. ఈ కేసులో పరారీలో ఉన్న ఖాలెద్ అలీ అలియాస్ చత్రు సింగ్, సురేష్‌ల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సొత్తును తదుపరి విచారణ నిమిత్తం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

**ఆక్సిటోసిన్ వల్ల ప్రమాదాలు ఇవీ**

పశువులకు తరచూ ఆక్సిటోసిన్ ఇంజెక్షన్లు ఇవ్వడం వల్ల సంతానోత్పత్తి సమస్యలు, గర్భాశయ ఒత్తిడి, మాస్టిటిస్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అలాగే ఈ పాలను వినియోగించే మనుషుల్లో హార్మోన్ల అసమతుల్యత, అకాల యుక్తవయస్సు, గర్భిణిలలో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. ఈ అక్రమ దందాను వెలికితీసిన శంషాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్స్పెక్టర్ కె. వెంకట్‌రెడ్డి, ఎస్ఐలు ఎస్.శేషు, కె.నాగరాజు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పహాడీషరీఫ్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

## మమ్మల్నీ టార్గెట్ చేసింది..

# కానీ బతికి పోయాం..

**జంట హత్య కేసులో నిందితురాలి సంచలన నిజాలు**

**మరో ఆరుగురిని హత్య చేసేందుకు పథకం .!**

**పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు**



పోలీసులను ఆశ్రయించిన బాధితులు

**తాండూరు, మే 18, ప్రభాతవార్త :** జంట హత్య కేసులో నిందితురాలు గురించి సంచలన నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. అప్పు ఇచ్చిన మరో ఆరు మందిని హత్య చేసేందకు కూడా పథకం వేసినట్లు తెలుస్తోంది. మమ్మల్ని కూడా డబ్బులు తీసుకునేందకు మొయినాబాద్ ఫామ్ హౌస్‌కు రావాలని కరీమా బేగం చెప్పిందని, కానీ తాము అక్కడికి వెళ్లలేదని, అయితే భవిష్యత్తులో ఆమె నుండి తమకు ప్రాణహాని ఉందని ఆరుగురు మహిళలు కరణ్‌కోట్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్ సమీపంలో ఇటీవల లభ్యమైన తాండూరుకు చెందిన ఇద్దరు మహిళల హత్య కేసులో ప్రధాన నిందితురాలైన కరీమా బేగం తనకు అప్పు ఇచ్చిన మరో ఆరు మంది మహిళలను కూడా హత్య చేసేందకు పథకం వేసినట్లు బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది. తాండూరు నియోజకవర్గ పరిధిలో అబేదా బేగం, మహబూబ్ బీలు ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించాలని అడిగినందకు రాజీవ్‌కాలనీకి చెందిన నిందితురాలు కరీమా బేగం, ఆమె భర్త, మరో వ్యక్తితో కలిసి ఇద్దరిని హత్య చేసి మొయినాబాద్‌లోని ఓ ఫామ్ హౌస్ సమీపంలో పాతిపెట్టిన విషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ హత్య కేసు బహిర్గతం కావడంతో మరి కొందరు కరీమా బేగంకు అప్పు ఇచ్చిన బాధితులు సోమవారం కరణ్‌కోట్ పోలీస్టేషన్‌లో నిందితురాలిపై ఫిర్యాదు చేయడంతో సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయి. తాము కూడా కరీమాబేగంకు అప్పు ఇచ్చామని, అప్పు చెల్లించాలని కోరడంతో కొందరిని మొయినాబాద్ ఫామ్ హౌస్‌కు రావాలని, అక్కడ యజమానిని అడిగి డబ్బులు చెల్లిస్తానని కరీమా బేగం పిలిచిందని, అయితే, పలు కారణాలతో అక్కడికి వెళ్లలేదని, తాము కూడా వెళ్లి ఉంటే మమ్మల్ని కూడా హత్య చేసి ఉండేదని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, భవిష్యత్తులో ఆమె నుండి తమకు ఎలాంటి ప్రాణహాని కలగకుండా రక్షణ కల్పించాలని ఆరుగురు మహిళలు కరణ్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## అప్రమత్తతే ఆయుధం

**ఐఓసీఎల్ కేంద్రంలో అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహణ**

3





వెండి కిరీటాన్ని అందజేస్తున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పొన్నం తరుణ్‌గౌడ్

## రామలింగేశ్వర స్వామికి వెండి కిరీటం బహూకరణ

**కీసర, మే18, ప్రభాతవార్త:** ప్రసిద్ధ శైవక్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పొన్నం తరుణ్‌గౌడ్ స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి వారికి వెండి కిరీటాన్ని సమర్పించి భక్తిని చాటుకున్నారు. ఆలయానికి చేరుకున్న తరుణ్‌గౌడ్‌కి అర్చకులు, ఆలయ అధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో అభిషేకం, అర్చనలు నిర్వహించి వెండి కిరీటాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తటాకం అభిలాష్, కర్రె రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బలవంతపు భూసేకరణలు నిలిపివేయాలి

**యాచారం, మే 18, ప్రభాతవార్త :** ప్రభుత్వాలు మారిన రైతుల గోస తీరడం లేదని స్వచ్ఛందసేవా కార్యకర్త కవుల సరస్వతి ఆవేదన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వాలు పేదల కోసం భూములను పంచితే నేడు ప్రభుత్వాలు రాబందుల్లా వాటిని లాక్కుంటున్నాయని మండి పడ్డారు. ఫార్మా కంపెనీకి భూములను ఇచ్చేది లేదని రైతులు తేల్చి చెబుతున్నా... ప్రభుత్వాలు మొండి వైఖరితో పోలీసులను అడు పెట్టుకుని అన్యాయంగా లాక్కుంటున్నాయని ఆరోపించారు. వ్యవసాయం నమ్ముకున్న రైతుల నోట్లో మట్టి కొట్టినట్టు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిబంధన ఉల్లంఘించి పంతం సాగిస్తే ఉరుకునేది లేదని హెచ్చరించారు.



కవుల సరస్వతి



అగ్నిప్రమాద నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## పరిశ్రమల భద్రత కోసం మాక్ డ్రిల్

**కొత్తూరు, మే 18, ప్రభాతవార్త:** కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్లాంట్‌లో సోమవారం నిర్వహించిన మాక్ ఎక్సర్‌సైజ్ విజయవంతంగా పూర్తైంది. అగ్నిప్రమాదాలు, గ్యాస్ లీకేజీ వంటి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే విధానాలపై అధికారులు ప్రత్యక్షంగా ప్రదర్శనలు నిర్వహించారు. ఫైర్ డిపార్ట్‌మెంట్, టీజీటీ విభాగం, మెడికల్ డిపార్ట్‌మెంట్, సీఆర్పీఎఫ్ బలగాలు, ఆక్టోపస్ వింగ్, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పాల్గొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, ప్రజలను సురక్షి త ప్రాంతాలకు తరలించే విధానం, ప్రమాద నియంత్రణ చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అధికారుల సమన్వ యం, సిబ్బంది అప్రమత్తతతో కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. పరిశ్రమల భద్రతలో భాగంగా ఇలాంటి మాక్ ఎక్సర్‌సైజ్‌లు ఎంతో ఉపయోగకరమని అధికారులు తెలిపారు. కార్యక్రమాన్ని స్థానిక అధికారులు పర్యవేక్షి ంచారు.

## శ్మశానవాటికకు భూమిని కేటాయించండి

**కందుకూరు, మే 18, ప్రభాతవార్త:** కందుకూరు మండలం ముచ్చర్ల గ్రామపంచాయతీ పరిధిలోని ఉట్లపల్లి గ్రామ స్మశాన వాటికకు ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని గ్రామస్తులు స్థానిక సర్పంచ్ ఊటు పద్మ మహేందర్. మాజీ సర్పంచ్ తేరటి లక్ష్మణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో స్థానికులు పెద్ద సంఖ్యలో వచ్చి కందుకూరు డివిజన్ కార్యా లయం ఆవరణలో జరిగిన ప్రజావాణి కార్యక్ర మంలో ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతిని ధులు నాయకులు మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు కోసం తమ గ్రామ పరిధిలోని వేలాది ఎకరాల భూమిని ప్రభుత్వం రైతుల వద్ద నుండి తీసుకుంటుందని పేర్కొన్నారు. గతంలో రైతులు ఎవరైనా మరణిస్తే తమ పంట పొలాల వద్ద దహన సంస్కారాలు చేసుకునేవారని, నేడు భూములు కోల్పోయిన వారంతా అయోమయ పరిస్థితిలకు గురికావాల్సి వస్తోందన్నారు. ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సంబంధిత విషయాన్ని టీజీ ఐఐసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి వివిధ మండలాలకు సంబంధించి ఐదు ఆర్జీలు అందాయని ఆర్డీఓ తెలిపారు.



## బాల్య దశలోనే దేశభక్తిని పెంపొందించుకోవాలి

**పెద్దేముల్, మే 18, ప్రభాతవార్త:** విద్యార్థులు బాల్య దశలోనే దేశభక్తిని పొంపొందించుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గాజుల బస్వరాజ్ అన్నారు. తాండూరు శ్రీరామక్రిష్ణ సేవా సమితి సౌజన్యంతో పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో 15 రోజుల పాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు (బాల వికాస కేంద్రం) ముగింపు సమావేశాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి శీ రామక్రిష్ణ సేవా సమితి గౌరవ అధ్యక్షులు గాజుల బస్వరాజ్ ముఖ్య అతిథిగా హజరై మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులు విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడంతో ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. స్వామి వివేక నంద భావజాలాన్ని బాల్య దశ నుంచే అలవ ర్చుకొని, దేశానికి అవసరమైన మంచి పౌరులుగా ఎదగాలని, దేశభక్తిని పెంపొందించుకోవాలని విద్యా ర్థులకు సూచించారు. శ్రీరామక్రిష్ణ మఠం అధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు పుస్తకాలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భార్గవి, కన్వీనర్ కెవిఎం వెంకట్, ఉపసర్పంచ్ మోహిద్, హెచ్‌ఎం వీరప్ప, శ్రీ శారద విద్యామందిర్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, క్యాంపు వాలంటీర్లు పద్మ, ప్రసన్న, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మర్ క్యాంపులో పాల్గొన్న గాజుల బస్వరాజ్

## పంచాయతీ నిధుల వినియోగంపై ఆడిట్

**కందుకూరు, మే 18, ప్రభాతవార్త :** కందుకూరు మండలం కందుకూరు పంచాయతీలో నిధుల వినియోగం తీరుపై ఇండియన్ ఆడిట్ అకౌంట్స్ సర్వీసెస్ ట్రేని అధికారులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ అధికారులు ఎం అన్ని గార్గ్, టీ అఖిల్ పాల్గొన్నారు. పంచాయతీలకు వచ్చే నిధులు అంతంతమాత్రంగా ఉంటు న్నా యని, వాటి వినియోగంలో పారదర్శకంగా ఉంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ స్వామి రెడ్డి, ఎంపీడీవో బి సరిత, ఎంపీ ఓ గీత, ఏజీ ఆడిటర్లు ఎస్సీఓ వెంక టేశ్వర్లు, ఏఏఓ శ్రీనివాస్ రెడ్డి, ఆడిట్ సూపర్వైజర్ శ్రీరాములు, ఉప సర్పంచ్ సౌడపు మమత వెంకటేష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి సురేందర్ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని ప్రైవేటు స్కూళ్లపై కఠిన చర్యలు

**మేడ్చల్, మే 18, ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నడిపించుకోవాలని మేడ్చల్ ఎఈవో శంకరయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ అనుమతులు, వాలిడిటీ తేదీలను పరిశీలించుకుని అనుమతులు లభించిన మేరకు మాత్రమే తరగతులు నిర్వహించుకోవాలని తెలిపారు. గుర్తింపు పొందిన పాఠశాలలు గడువు ముగిసిన తర్వాత నిబంధనల మేరకు వెంటనే పునరుద్ధరణ అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్యంగా ముందస్తు అనుమతి పొందకుండా వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాలలు నిర్వహించినచో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా అనుమతులు లేని పాఠశాలల్లో తమ పిల్లల్ని చేర్పించి మోసపోకూడదని ఎంఈఓ సూచించారు.

## గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై సర్పంచ్ ఫిర్యాదు

**తాండూరు, మే 18, ప్రభాతవార్త :** తాండూరు నియోజకవర్గం కరణ్‌కోట్ గ్రామ పంచాయతీ పరిధిలో గత మూడు నెలలుగా మధూర్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయడం లేదని, వినియోగ దారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని గ్రామ సర్పంచ్ రాజ్‌కుమార్ సోమవారం ప్రజావాణిలో తహసీల్దార్ తారాసింగ్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో అంబాభవాని, రాధా ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా సరఫరా చేస్తున్నారని, గ్రామంలో మధూర్ గ్యాస్ ఏజెన్సీకి సంబంధించి సుమారు 1000కి పైగా కనెక్షన్‌లు ఉన్నాయని.. వారందరు తాండూరుకు వెళ్లి సిలిండర్లను తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. అధికారులు స్పందించి మధూర్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గ్రామంలో గ్యాస్ సిలిండర్లను సరఫరా చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ రాజ్‌కుమార్

# పర్యావరణ పరిరక్షణకు గోశాల దోహదం

**కొత్తూరు, మే 18, ప్రభాతవార్త :** కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలోని స్వయంభు శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలో సోమవారం ఆల కమిటీ చైర్మన్ విజయవాడ అనితారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చేసిన గోశాల ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చెవులపల్లి ప్రతాపరెడ్డి, ఎంఎస్ఎన్ కంపెనీ యజమాని జీవన్ రెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గోశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, గోమాత సంరక్షణ భారతీయ సంస్కృతిలో పవిత్రమైనదన్నారు. గోశాలలు ఆధ్యాత్మికతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధితో పాటు గోశాల ఏర్పాటు భక్తులకు మరింత ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ, మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్, నందిగామ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుమార స్వామి గౌడ్, సర్పంచులు దయానంద్ గుప్తా, గబ్రు చౌహాన్, బోకుల శ్రీరాములు, పిఎసిఎస్ చైర్మన్ పద్మారావు, మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, ఉప సర్పంచ్ శాంతన్ రెడ్డి, కృష్ణ, మాజీ ఎంపిటిసి చంద్రపాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి రమేష్, దేశాల రమేష్, శంకర్, పద్మ రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చెవులపల్లి ప్రతాపరెడ్డి తదితరులు

## ఫిర్యాదు చేసినా స్పందించరేం?

**కబ్జా అవుతున్న సర్కారు భూములను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్**

**షాద్‌నగర్, మే 18, ప్రభాతవార్త :** ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా అమ్ముకుంటూ వ్యాపారాలు చేసుకుంటున్నా అధికారుల దృష్టికి రావడం లేదని, తాము దృష్టికి తెచ్చిన అధికారులు సరైన రీతిలో స్పందించడం లేదని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు షాద్ నగర్ ఎమ్మార్వో కు లేఖ రాశారు. ఫరూక్ నగర్ మండలం ఎలికట్ట గ్రామ పరిధిలో సర్వేనెంబర్ 92/1 ఎకరా మూడు గుంటల పోరంబోకు షాబాద్ మండలం సర్దార్ నగర్ నివాసి లావుని పట్టా ఇవ్వడం జరిగిందన్నారు. కాగా ఈ భూమిని ఎలికట్ట రామచంద్రయ్య నారాయణ, మల్లేశం అనే వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి అమ్మాడని పేర్కొన్నారు. అదేవిధంగా సర్వేనెంబర్ 140 లో 12.03 ఎకరాల భూమిని షాబాద్ కు చెందిన ఓ బట్టల వ్యాపారికి అమ్మి ప్రభుత్వ భూమిని సంపన్నుడికి సొంతం చేశారని పేర్కొన్నారు. దీనిపై గత ఫిబ్రవరి 20వ తేదీన తాను ఫిర్యాదు చేసిన పనికి ఇప్పటిదాకా స్పందించలేదన్నారు. అక్రమంగా లావుని పట్టా పొందిన గోపాల్ మృతిచెందగా అతని కుమారులు సిద్ధి లింగం, రాజలింగం, వెంకటేష్ జిఎంఆర్ సంస్థకు చెందిన ఒక ఉద్యోగికి విరాసత్ చేశారని ఆరోపించారు. గోపాల్ కుమారుడైన వెంకటేష్ ఎవరికి అనుమానం రాకుండా ఇక్కడ ఒక షెడ్ వేసి వ్యవసాయం చేస్తున్నట్లు నటిస్తున్నాడని పేర్కొన్నారు. మూడు కోట్ల విలువైన ఈ భూమి షాబాద్‌షాద్ నగర్ మార్గంలో రోడ్డు భవనాల శాఖ కు అందుబాటులో ఉందన్నారు. దీనిపై విచారణ జరిపి పట్టాను రద్దుచేసి భూమిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ కార్యాలకు ఉపయోగించాలని సూచించారు.



బక్కని నర్సింహులు

## ప్రణాళికతో ప్రగతికి బాటలు వేద్దాం



మారథాన్ రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి

**షాద్‌నగర్, మే 18, ప్రభాతవార్త :** ప్రణాళిక బద్ధంగా ముందడుగు వేసి పురపాలికను ప్రగతివైపు నడిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్ నగర్ పట్టణంలోని మున్సిపాలిటీ కమిషనర్ సునీత రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరిట సాగుతున్న 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా యువతక్రీడలు అనే అంశంపై మార్ దాన్ రన్ ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయం నుంచి పట్టణ ముఖ్య కూడలి వరకు కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జెండా ఊపి ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ప్రణాళికబద్ధంగా పట్టణాలను, గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసుకో వాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరిస్తేనే వార్డులు బాగుపడతాయని ఈ సంద ర్భంగా ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, మున్సిపల్ కమిషనర్ సునీతా రెడ్డి, ఎంపీడీవో బన్సీలాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, కౌన్సిలర్లు పెంటయ్య, మురళీమోహన్ (అప్పి), సంతోషి బాయ్ చందూలాల్, రాజు నాయక్, దిలీప్, బచ్చలి నరేష్, ఎస్పీ శివ, పిన్న మోని గోపాల్, ముబారక్ అలీ ఖాన్, సాధిక్, మాజీ జెడ్పీటిసి వెంకట్రాంరెడ్డి, మండల విద్యాధికారి మనోహర్, నల్లమోని శ్రీధర్, మాధవులు యాదవ్, భరత్ లావోటి, మంగ అశోక్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.



మేడిగడ్డలో పాలకవర్గంతో సమావేశమైన తహసీల్దార్ ఫయ్యూమ్ ఖాద్రి

## ఓటరు మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలి

**ఆమనగల్లు, మే18, ప్రభాతవార్త:** ఓటరు వివరాలను పూర్తిగా సేకరించి విశ్లేషించే ప్రక్రియకు గ్రామ పాలకవర్గంతోపాటు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని ఆమనగల్లు తహసీల్దార్ ఫయ్యూమ్ ఖాద్రి అన్నారు. ఓటరు మ్యాపింగ్‌తో పంచాయతీ ఆయా ప్రాంతాలలోని స్త్రీలు, పురుషులతోపాటు కొత్త ఓటరు, సంఖ్యను సేకరించి తుది జాబితాను రూపొందిస్తామన్నారు. బూత్ లెవెల్ ఆఫీసర్‌లకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం తహశీల్దార్ పర్యటించి పాలకవర్గంతో సమావేశమయ్యారు. ఈసంధర్భంగా ఆయన పలు అంశాలను వివరించి ఓటరు మ్యాపింగ్ ప్రక్రియకు సహకరించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితా చేపట్టబోయే మార్పులు వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచు విజయ్‌రాథోడ్, మాజీ ఉపసర్పంచు మల్లేశ్, ఆర్ఐ సంపత్, బిఎల్ఓ సరోజ, హరిలాల్, పాండు తదితరులు ఉన్నారు.



ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దీపక్ తివారీ

## యువజన క్రీడోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**వికారాబాద్, ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో బాగంగా ఈ నెల 18 నుండి 23 వరకు పర్యాటక వారోత్సవాలు, క్రీడా యువజన వారోత్సవాలు, పోస్టర్ లు, కరపత్రాలను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సోమవారం ఆవిష్కరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో బాగంగా ఈ నెల 18 నుండి 23 వరకు క్రీడా, యువజన వారోత్సవాలు, పర్యాటక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు సకాలంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. యువతలో పర్యాటక రంగంపై అవగాహన పెంపొందించడం, వారిని స్థానిక పర్యాటక ప్రదేశాల అభివృద్ధి, పరిరక్షణలో భాగస్వాములను చేయడం లక్ష్యంగా నిర్వహించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, జడ్పీ సీఈఓ సుదీర్, రేంజ్ అధికారి శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డిటి వినోద్‌కు వినతిపత్రం అందజేస్తున్న మెడికల్ షాప్‌ల ప్రతినిధులు

## 20న మెడికల్ దుకాణాల బంద్

**ఆమనగల్లు, మే18, ప్రభాతవార్త:** ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ డ్రగ్గిస్టు పిలుపుమేరకు ఈనెల 20న ఒకరోజు ఆమనగల్లు మండల పరిధిలో మెడికల్ దుకాణాలను మూసి వేస్తున్నట్లు ఆమనగల్లు మెడికల్ షాపు యూనియన్ తెలిపింది. మెడికల్ దుకాణాలు ఎదుర్కుంటున్న ప్రధాన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళేందుకే బంద్ పాటిస్తున్నట్లు వారు తెలిపారు. సోమవారం ఆమనగల్లు యూనియన్ ప్రతినిధులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ వినోద్‌ను కలుసుకుని బంద్‌కు సంబంధించిన పత్రాన్ని అందజేశారు. ఈమేరకు వారు మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా మందుల అమ్మకాలతో మెడికల్ దుకాణాలు తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి నిరసనగానే జాతీయ స్థాయిలో బంద్‌కు పిలుపునిచ్చినట్లు వారు పేర్కొన్నారు. కాగా అత్యవసర మందులు అవసరమైన వ్యక్తులు ముందు జాగ్రత్తగా వాటిని కొనుగోలు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షులు బికుమాండ్ల యాదయ్యగుప్త, ప్రధాన కార్యదర్శి రవిందర్ఆనంద్, కోశాధికారి ఉప్పల రాములు, సభ్యులు పాపిశెట్టి అరవింద్, ప్రవీణ్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## పట్టణ, మండలాలకు సారథుల నియామకం

**షాద్‌నగర్, మే 18, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గానికి పట్టణ, మండలాల వారీగా అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ పూర్తి అయింది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఈ జాబితాను సోమవారం విడుదల చేశారు. షాద్ నగర్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా అందరూ ఊహించినట్లుగానే నలమోని శ్రీధర్ అవకాశాన్ని అందుకున్నారు. ఇక కొత్తూరు మున్సిపాలిటీ అధ్యక్షుడిగా సుదర్శన్ గౌడ్ అవకాశాన్ని రెండోసారి యధావిధిగా దక్కించుకున్నారు. ఇక మండలాల వారిగా తీసుకుంటే ఫరూక్ నగర్ మండల అధ్యక్షుడిగా కుమ్మరి శ్రీనివాస్, కొందుర్గు మండల అధ్యక్షుడిగా పురుషోత్తం రెడ్డి, చౌదరిగుడా మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్, కొత్తూరు మండల అధ్యక్షుడిగా శేఖర్ రెడ్డి, నందిగామ మండల అధ్యక్షుడిగా కుమార స్వామి, కేశంపేట మండల అధ్యక్షుడుగా రమేష్ ఎన్నికయ్యారు. ఇటీవల వీరి జాబితాను నియోజకవర్గము నుండి అధిష్టానానికి పంపించారు. పరిశీలన అనంతరం అధిష్టానం ఈరోజు నూతన అధ్యక్షుల ప్రక్రియను పూర్తి చేసి అధికారికంగా ఉత్తర్వులను జారీ చేసింది.



సదరం సెంటర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

## సదరం క్యాంపునకు ఏర్పాట్లు

**వికారాబాద్, ప్రభాతవార్త :** ప్రతి సోమవారం నిర్వహించే సదరం క్యాంపు నకు వచ్చే దివ్యాంగులకు సరైన వసతులు ఏర్పాటు చేయాలనీ, రోగులకు సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ అన్నారు. సోమవారం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, వైద్య సిబ్బంది హాజరు, రోగులకు అందుతున్న చికిత్స, ఔషధాల లభ్యతపై సమగ్రంగా పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే సదరం క్యాంపులో అన్ని మౌళిక వసతులు ఏర్పాటు చేయాలనీ అన్నారు. సదరం సెంటర్‌ను పరిశీలించారు. శారీరక, మానసిక చూపు, వినికిడి వంటి వికలాంగత ఉన్న వారికీ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు జారి చేయాల్సిందిగా ఆదేశించారు. ఆసుపత్రిలో మైనర్ రిపేర్ పనులను పూర్తి చేయాలనీ సంబంధింత అధికారులకు ఆదేశించారు. ఆసుపత్రి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, రోగులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించించారు. ఆసుపత్రిలో రిపేరు పనులను పరిశీలించఇ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడివో, సర్పంచ్

## ఉపాధి కూలీలకు పనిదినాలు పెంచాలి

**యాచారం, మే 18, ప్రభాతవార్త :** ఉపాధి కూలీలకు మౌలిక వసతులు కల్పిస్తూ వారికి అధిక పని దినాలు కల్పించాలని ఎంపీడీవో రాధా రాణి తెలిపారు. సోమవారం యాచారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఇందిరమ్మ ఇల్లు ఉపాధి హామీ పనులను పరిశీలించారు. తక్కలపల్లి తండా గ్రామ పంచాయతీ లోని ఉపాధి కూలీలను కలిసిన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏపీవో లింగయ్య గ్రామ కార్యదర్శి తో గ్రామంలో చేపట్టిన కార్యక్రమాలను వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూలీలకు సౌకర్యాలు కల్పిస్తూ పని దినాలు పెంచాలని హరితహారం మొక్కల పెంపకం, గ్రామంలో పరిశుభ్రత తదితర అంశాలపై సర్పంచితో చర్చించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని సకాలంలో బిల్లు వచ్చేలా చూడాలని సూచన చేశారు.

## బస్సుకోసం రెండేళ్లుగా కాలయాపన

**యాచారం, మే 18, ప్రభాతవార్త:** యాచారం మండలం మేడిపల్లి నక్కర్త గ్రామానికి చెందిన పిజిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ప్రొద్దుటూరి రవీందర్ గుప్త కల్వకుర్తి ప్రజావాణిలో ఆమనగల్ నుంచి మేడిపల్లి మాల్, మేడిపల్లి హైదరాబాద్, హైదరాబాద్ నుండి మేడిపల్లి ఆమనగల్‌కు బస్సులు నడపాలని వినతి పత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌డివోతో మాట్లాడుతూ.. గత రెండు సంవత్సరాలుగా కల్వకుర్తి డిపో మేనేజర్‌ను కలిసి పలు మార్లు వినతి పత్రాలు అందజేసిన కుంటి సాకులతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. స్పందన లేక పోవడంతో ప్రజావాణిలో వినతి పత్రం అందజేస్తే సమస్య పరిష్కారం అవుతుందని నమ్మకంతో వినతి పత్రం ఇస్తున్నట్లు రవీందర్ గుప్త ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజల దీర్ఘ కాలిక సమస్యలను పరిష్కరించాలని కోరారు.



ప్రజావాణిలో వినతి పత్రం అందజేస్తున్న రవీందర్

## విధ్వంసం అవుతున్న చెరువును కాపాడండి

**మేడ్చల్, మే 18, ప్రభాతవార్త :** కొంతమంది స్వార్థం కారణంగా విధ్వంసం అవుతున్న మేడ్చల్ పెద్ద చెరువును కాపాడాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం, మేడ్చల్ జీహెచ్ఎంపీ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వాణిలో స్థానిక నాయకులు ఫిర్యాదు చేశారు. సీఎంఆర్ కళా శాల, సుతారి గూడ చెరువు కుంట నుంచి మేడ్చల్ పెద్ద చెరువులోకి కాలష్య నీరు వచ్చి చేరుతోందన్నారు. అదే విధంగా అక్రమార్కుల చేతిలో పెద్ద చెరువు కట్ట ధ్వంసం అవుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి పెద్ద చెరువును కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాతూరి సుధాకర్ రెడ్డి. సాకార బోయిన వెంకటేష్ ముదిరాజ్, దండు శంకర్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ పత్య, కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి

## లయన్స్‌సేవలు ప్రశంసనీయం

**ఆమనగల్లు, మే18, ప్రభాతవార్త:** సమాజ హితం కోసం నిస్వార్థంతో అందిస్తున్న లయన్స్ సేవలు ఎంతో ప్రశంసనీయమని, వెలకట్టలేనివని ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్మన్ పత్యానాయక్, కమిషనర్ రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉచిత సేవలు నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తాయని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కొనసాగుతున్న సేవలు భావి తరలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు, లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఆమనగల్లు పట్టణంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు మెండెం చంద్రశేఖర్‌గుప్త శిబిరానికి హాజరైన 67మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 23 మంది దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు క్లబ్ పీఆర్ఓ ఎంఏ పాష తెలిపారు. ఈసందర్భంగా క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులు పత్యానాయక్, రాఘవేందర్‌రెడ్డి ప్రసంగించి క్లబ్ సేవలపై ప్రశంసలు కురిపించారు. లయన్స్‌సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడే వారికి స్వచ్ఛంద సంస్థల ఉచిత సేవలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కార్యదర్శి గంప శ్రీనివాస్, జూలూరి రమేశ్, కొండల్‌రెడ్డి, పాండురెడ్డి, మోహన్‌రెడ్డి, పీఆర్ఓ పాష తదితరులు ఉన్నారు.

## పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

**షాద్‌నగర్, మే 18, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన మద్దతు ధరలు (ఎంఎస్‌పి) ఏమాత్రం సరిపో వని, అరకొర పెంపుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలంగాణ రక్షణ సేన ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండి. ముస్తఫా ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, కూలీల రేట్లు మరియు వ్యవసాయ యంత్రాల అద్దెలు విపరీతంగా పెరిగిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో.. కేంద్రం పెంచిన ఈ స్వల్ప ధరలు రైతుల పెట్టుబడి ఖర్చులకు కూడా సరిపోవడం లేదని వారు పేర్కొన్నారు.



సాత్విక్ రెడ్డిని అభినందిస్తున్న బీఆర్ఎస్ యువనాయకులు

## మెరిట్ విద్యార్థికి సత్కారం

**షాద్‌నగర్, మే 18, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణం సాయి బాబ కాలనీకి చెందిన రమణ రెడ్డి కుమారుడు సాత్విక్ రెడ్డి ఇటీవల నిర్వహించిన ఎప్ సెట్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 50వ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువనాయకులు మురళీకృష్ణ యాదవ్ వారి స్వగృహానికి వెళ్లి సాత్విక్ రెడ్డిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాత్విక్ రెడ్డి సాధించిన విజయం షాద్ నగర్ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్పీ శివ నాయకులు రాజేందర్ సింగ్, భాను శర్మ, రామకృష్ణ యాదవ్, మాధవ రెడ్డి, బంగ్లకాడి శ్రీనివాస్, వేణు, పృథ్వీరాజ్, సందీప్ ఆంజనేయులు, రహమాన్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



## పంట మార్పిడితోనే అధిక దిగుబడి సాధ్యం

**జిల్లేడు చౌదరి గూడెం, మే 18, ప్రభాతవార్త:** రైతులు పండించే పంటలో మార్పిడి చేస్తేనే అధిక దిగుబడి సాధ్యమవుతుందని జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్ రాజు అన్నారు. సోమవారం జిల్లేడు చౌదరి గూడెం మండలంలోని పెద్ద ఎలికిచర్ల రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు దామోదర్ రాజు, డాక్టర్ భారతీయులు రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు ఏజీ వీల్స్ ఉపయోగించిన రాదని ఆయన అన్నారు. రోటవేటర్ ఉపయోగించి వరి పంటలు సాగు చేసుకోవాలని వారు పేర్కొన్నారు. రసాయనిక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని తెలిపారు. పచ్చి రొట్టె పైర్లు, జీవన ఎరువులు వినియోగం పెంచుకొని యూరియా వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని రైతులకు వివరించారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి రైతులు పంటలు పండించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**కుల్కచర్ల,మే,18 ప్రభాతవార్త :** నిరుపేద కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని బిజెపి జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాదరావు అన్నారు. మండల కేంద్రానికి చెందిన శావుకు యాదగిరి అనే వ్యక్తి కొంత కాలంగా క్యాన్సర్ కారణంగా బాధపడుతూ.. సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసున్న బిజెపి జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాదరావు యాదగిరి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ... ప్రతి నిరుపేద కుటుంబాలను ఆదుకోవడమే తమ లక్ష్యమన్నారు.

## కొందుర్గును మర్చిపోలేను



**కొందుర్గు, మే 18, ప్రభాతవార్త :** కొందుర్గు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా ఉన్నపుడు పదోన్నతి రావటం ఎంతో సంతోషంగా ఉందని, అందుకే ఎప్పటికి కొందుర్గును మర్చిపోలేను అని ఎంపిడిఒ లక్ష్మి అనురాధ అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారిని సుమారు రెండు సంవత్సరాలుగా నిర్వర్తించి డిప్యూటి సిఇఒ పదోన్నతిపై వెళుతున్న లక్ష్మి అనురాధకు సోమవారం నాడు మండల పరిషత్ హాల్లో అధికారులు,ప్రజా ప్రతినిధులు, మండల పరిషత్ సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు,అధికారులు, మండల పరిషత్ సిబ్బంది సహకారంతో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి, ఉపాధి కార్యక్రమాలను సకాలంలో పూర్తిచేసామని ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపిడిఒ గణపతి, ఎంపి ఓ విజయ్ కుమార్ పాల్, ఎపి ఒ నర్సింగరావు, సర్పంచులు బోయ అశోక్, మరాఠి రాజకుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి వివిధ పార్టీల నాయకులు రాములు గౌడ్, మల్లేష్ గౌడ్, ప్రవీను తోపాటు మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరికి వ్యాయామం ఎంతో ముఖ్యం!

**కొందుర్గు, మే 18, ప్రభాతవార్త :** అందరు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు వ్యాయామం చేయాల్సిన అవసరం ఉన్నది ఇంచార్జ్ ఎంపిడిఒ గణపతి అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం భాగంగా బుధవారం నాడు స్థానికబస్టాండ్ ఆవరణలో 2.కే రన్ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విన మాట్లాడుతూ వ్యాయామం ఎప్పటి నుండో ఉందని నేటి సమాజం మర్చిపోతున్న సమయంలో ప్రభుత్వం గుర్తు చేస్తుందని అన్నారు.

రెండు కిలో మీటర్ల వరకు రన్నింగ్‌గా వెళ్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చౌడా పురం ప్రభాకర్, కేతావత్ గోపాల్ నాయక్, కనకమామిడి అంజయ్య, మాజీ ఎంపిటిసి కావాలి యాదయ్య, పార్టీల నాయకులు రాములు గౌడ్, చంద్రశేఖర్, ప్రసాద్, జంగయ్య, గోపాల్ తోపాటు యువకులు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్ల సమస్యల పరిష్కరించండి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య**

**కొడంగల్,మే 18,ప్రభాతవార్త:**

ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బుస్స చంద్రయ్య కోరారు. ఈ మేరకు సోమవారం ఆశ కార్యకర్తలతో కలిసి పట్టణంలోని కడా కార్యాలయం,ఎంపిడిఒ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ప్రతి నెల 1న పారితోషకాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు రూ.18వేలు ఫిక్స్ వేతనం చెల్లించాలన్నారు. అలాగే ఆశలకు కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.1500 పారితోషకాలను వెంటనే అమలు చేయాలన్నారు. 2021 జులై నుండి డిసెంబర్ వరకు ఆరు నెలల విఆర్‌సి,ఏరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. 2022 నుండి 2025 వరకు నాలుగు సంవత్సరాల లెప్రసీ సర్వే,పల్స్ పోలియో ఎలక్షన్ డ్యూటి పెండింగ్ డబ్బులు చెల్లించాలన్నారు. ఎగ్జామ్ డ్యూటీలకు అదనపు పారితోషకాన్ని ప్రభుత్వం నిర్ణయించాలని కోరారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.50లక్షల ఇన్సూరెన్స్,పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలనే తదితర డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ సంఘం కార్యదర్శి కే.లక్ష్మీ,అశోక రాణి,యాదమ్మ, అమృతమ్మ,పార్వతమ్మ,సత్యమ్మ,వినోద,పుష్ప,విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



కడా కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందిస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు

## క్రికెట్లో విజేతలకు బహుమతుల పంపిణీ

**తలకొండపల్లి, మే 18, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. గ్రామంలో గత వారంరోజులుగా నిర్వహిస్తున్న అండర్ 16 క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు గ్రామంలోని 18 మంది ఈ పోటీలకు గ్రామంలోని 18 టీంలు క్రికెట్లో పాల్గొన్నారు. సోమవారంనాడు గెలుపొందినవారికి స్థానిక సర్పంచ్ కాదు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా గెలుపొందిన వారికి సర్పంచ్ కాసు శ్రీనివాసరెడ్డి రూ.10వేలు, రెండో బహుమతి గెలుపొందిన వారికి ఉపసర్పంచ్ బూత్కూరు వెంకటరెడ్డి రూ.5వేలు. టీ షర్టు సీనియర్ ప్లేయర్ రాజమోనీ తిరుపతి రూ 4 వేలతో టీ షర్టు అందజేశారు. సందర్భంగా జరిగిన సమావేశంలో సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఆటల పోటీల ద్వారా యువకులకు శారీరక దారుఢ్యంతో పాటు సోదర భావం పెరుగుతుందన్నారు. క్రికెట్ పోటీల్లో ఆడినవారందరూ ఓడిపోయినా, సోదర భావంతో మెలగాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అనంతరం విజేతలకు షీల్డ్‌ను, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, ఉపసర్పంచి బూత్కూరు వెంకటరెడ్డి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు .



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి

## రసాయనాల వినియోగాన్ని తగ్గించి నేలతల్లిని కాపాడుకుందాం

**వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త డా. కె. పరిమళ**

**ధారూర్, మే 18, ప్రభాత వార్త:** ధారూర్ మండల పరిధిలోని మోమిన్ కలాన్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం సంయుక్త ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమం సోమవారం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. కె. పరిమళ మాట్లాడుతూ, రైతులు పంటల్లో యూరియా వాడకాన్ని విపరీతంగా పెంచేస్తున్నారని, దీని వల్ల నేల ఆరోగ్యం దెబ్బతిని దీర్ఘకాలంలో ఉత్పాదకత తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రసాయనాల వినియోగాన్ని వీలైనంతవరకు తగ్గించి పర్యావరణాన్ని, నేలతల్లిని కాపాడుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. పురుగుల మందుల మితిమీరిన వాడకం వల్ల రైతులకు మేలు చేసే వానపాములు, మిత్ర పురుగులు నశించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, మార్కెట్లో మంచి గిరాకీ ఉన్న వరి రకాలను ఎంచుకుని సాగు చేయడం ద్వారా రైతులు అధిక లాభాలు గడించవచ్చని ఆమె సూచించారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ, రైతులు సాంప్రదాయ పద్ధతులను వీడి సేంద్రియ వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, సహజ పద్ధతుల ద్వారా రసాయన రహిత పంటలను పండించాలని కోరారు. సాగునీటి ఎద్దడిని అధిగమించడానికి నీటి సంరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్ వంటి బిందు సేద్య పద్ధతులను అవలంబించాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సులో యంగ్ ప్రొఫెషనల్ సల్మాన్, వ్యవసాయ విస్తరణ అధికారులు హరి ప్రసాద్, మల్లేష్, మోమిన్ కలాన్ గ్రామ సర్పంచ్ మాధవి, మోమిన్ కుర్ద్ గ్రామ సర్పంచ్ ప్రభాకర్ గౌడ్, పలువురు ప్రజాప్రతినిధులు ధారూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## అగ్ని ప్రమాదాల నివారణపై హెచ్‌పిసిఎల్‌లో మాక్ డ్రిల్



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్



మంటలు ఆర్పే విధానాన్ని ప్రదర్శిస్తున్న ఫైర్‌సిబ్బంది

**ఘట్‌కేసర్, మే 18, ప్రభాతవార్త:** ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అంకుశాపూర్ సమీపంలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో సోమవారం అగ్నిప్రమాదాల నివారణపై అధికారులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ మార్గ నిర్దేశకత్వంలో పరిశ్రమలో జరిగే అగ్నిప్రమాదాలపై ఎన్‌డిఆర్‌ఎఫ్, ఆర్‌డిఎఫ్, వైద్య, అగ్ని, పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, పోలీసు, ట్రాఫిక్, పౌరసరఫరాలు, పశువైద్య, రెవెన్యూ, పంచాయతీరాజ్, రోడ్లు, భవనాలశాఖ, జిహెచ్ఎంసిల నుంచి వివిధ స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రమాద తీవ్రతను తగ్గించే చర్యలను ప్రదర్శించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించి ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ప్రమాదాల నివారణపై పలు సూచనలు చేశారు. మాక్‌డ్రిల్‌లో పరిశ్రమలో ఒక ట్యాంక్ నుంచి మరొక ట్యాంక్‌కు ఆయిల్ మార్చే సమయంలో అకస్మాత్తుగా ఆయిల్ ఓవర్‌ఫ్లో అయి ఫ్లాష్ జరిగితే సెక్యూరిటీ సిబ్బంది ఈప్రమాదాన్ని గుర్తించి కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వగా ఆయా విభాగాల బృందాల ప్రమేయంతో ప్రమాద తీవ్రతను తగ్గించే చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదం జరిగితే తీసుకోవాల్సిన అత్యవసర నివారణ చర్యలు, జాగ్రత్తలపై వివిధ శాఖల సమన్వయంతో ప్రమాద తీవ్రతను తగ్గించేందుకు చేపట్టవలసిన చర్యలపై మాక్‌డ్రిల్ నిర్వహించారు.

## ఇళ్లలో పనిచేసే వ్యక్తుల వివరాలు తీసుకోవాలి

**ఘట్‌కేసర్, మే 18, ప్రభాతవార్త:** ఇళ్లలో పనిచేయడానికి వచ్చే వ్యక్తుల పూర్తి వివరాలు తీసుకోవాలని ఉప్పల్ జోన్ డిసిపి కె.సురేశ్‌కుమార్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్‌రోడ్డులోని సన్‌షైన్ పార్క్ కాలనీలో సోమవారం సాయంత్రం మీసురక్ష కార్యక్రమం నిర్వహించారు. మల్కాజ్‌గిరి సీపీ సుమతి ఆదేశాల మేరకు ఇక్కడ ఉప్పల్ డిసిపి సురేశ్‌కుమార్, మేడిపల్లి ఏసీపీ మోహన్‌కుమార్‌లు పాల్గొని కాలనీవాసులకు దొంగతనాల నివారణపై అవగాహన కల్పించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇళ్లలో పనిచేసే వ్యక్తులు డబ్బు, బంగారు అభరణాల కోసం హైదరాబాద్ నగరంలో దొంగతనాలు, హత్యలకు పాల్పడుతున్నారని వారి పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇళ్లలో పనికోసం వచ్చే వ్యక్తుల ఆధార్‌కార్డు, సెల్‌పోన్‌నెంబర్, చిరునామా తదితర వివరాలను తప్పకుండా తీసుకోవాలని డిసిపి సూచించారు. కాలనీల్లో చోరీల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మీ సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి, ఎస్‌ఐ బి.ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్, సన్‌షైన్ పార్క్‌కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి రాషికా, కేశవపట్నం అంజనేయులు, సగ్గు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సన్‌షైన్‌పార్క్ కాలనీవాసులతో మాట్లాడుతున్న ఉప్పల్ డిసిపి సురేశ్‌కుమార్, మేడిపల్లి ఏసిపి మోహన్‌కుమార్



### ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా

## మెగా రన్

**మొయినాబాద్, మే 18, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యచరణలో భాగంగా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ లోగల ఎన్టీఆర్ మోడల్ స్కూల్ నుంచి 2 కిలోమీటర్ల మెగా రన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ షాబాద్ సోనియా దర్శన్, 3వ వార్డు కౌన్సిలర్ బిల్లాపాటీ కవిత ఎల్లేష్, 4వ వార్డు కౌన్సిలర్ షాబాద్ కిషన్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కట్టమీది శ్రీను పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి చైర్ పర్సన్ షాబాద్ సోనియా దర్శన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్టీఆర్ మోడల్ స్కూల్ నుండి హిమాయత్ నగర్ చౌరస్తా వరకు ర్యాలీగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ యువత, విద్యార్థులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించడం, సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ మెగా రన్ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా అడుగులు

**యువతలో క్రీడా స్ఫూర్తిని నింపడం అట్టహాసంగా మార్థాన్ పరుగు**

**నందిగామ, మే 18, ప్రభాతవార్త :** ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ప్రగతి వైపు అడుగులు వేస్తున్నారని నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం నందిగామ మండల కేంద్రం నుండి బైపాస్ జాతీయ రహదారి వరకు మార్థాన్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం పి ఓ చక్రధర్ గౌడ్, చేగూరు సర్పంచ్ మంకాల శ్రీశైలం,నందిగామ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, షాద్నగర్ ఏఎంసి డైరెక్టర్ నర్సింలు,ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, శివగళ్ల సురేష్, టైలర్ కృష్ణ, కిట్టు, చేగూరు ఉపసర్పంచ్ ఆవుల మంద శివశంకర్, నాయకులు సికృష్ణ గౌడ్, శివకుమార్ గౌడ్, అగ్గి సూరి, శివగళ్ళ సుమన్, పిట్టల రాములు, ప్రవీణ్ రెడ్డి, టీ జంగయ్య, నరేందర్ రెడ్డి,కే రామచంద్రి.విద్యార్థులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.



నందిగామలో మార్థాన్ రన్‌లో సర్పంచ్ తదితరులు

## 21న హిందూ సమ్మేళన కార్యక్రమము

**మోమిన్‌పేట్, మే 18. ప్రభాతవార్త:** దేశానికి ఆత్మ హిందూధర్మం, హిందూ సంస్కృతి మరియు హిందూ సమాజం, కావున హిందూ సమాజాన్ని చైతన్య వంతంచేసి సమైక్య పరిచి మనదేశాన్ని తిరిగి విశ్వగురువుగా నిల పాలనేలక్ష్యంతో నేటి కాలమాన పరిస్థితుల్లో ఎదు రౌతున్న అనేక సవాళ్ళను ఎదుర్కొనేందుకు హిందువుల ఐక్యత అవ సరం. హిందూ సమాజంపట్ల గౌరవభావం, ఏకాత్మతాభావన, స్వధర్మం పట్ల అంకితభావం, సేవాగుణం వంటి వాటిని వికసింపచేసేందుకు మీ అందరి భాగస్వామ్యాన్ని కోరుకుంటూ హిందూ సమ్మేళనం ఏర్పాటు చేయడమైందని మోమిన్‌పేట్ మండల పరిధిలోని వెల్‌చాల్ గ్రామ ఉపమండలం హిందూసమ్మేళన సమితి నిర్వాహకులు తెలిపారు. సోమవారం ప్రభాతవార్తతో వారు మట్లాడుతూ ఈ హిందూ సమ్మేళన కార్యక్రమంలో మోమిన్‌పేట్ మండలపరిధిలోని దుర్గంచెర్వు, మొరంగపల్లి, ఎన్కేపల్లి, కేసారం, సయ్యదలీపూర్, ఇజ్రాచిట్టెంపల్లి, పల్లెగుట్ట తాండా గ్రామాల హిందూ బంధువులు పాల్గొంటారని, పైన పేర్కొన్న గ్రామాల హిందువులందరూ కుటుంబసమేతంగా పాల్గొనాలని సాదరంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఇట్టి కార్యక్రమం వెల్‌చాల్ గ్రామంలోని శ్రీ మల్లికార్జున స్వామి దేవాలయం నందు గురువారం సాయంత్రం 5:00, గంటలకు నిర్వహించడం జరుగుతుందని, అందుకు అవసరమగు ఏర్పాట్లు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీమాన్ బైలూర్ యోగేష్ ప్రభు (ఆధ్యాత్మిక వేత్త మరియు ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షులు భాగ్యనగరం) మహిళా వక్త: శ్రీమతి రాజేశ్వరి మాతాజీ (విద్యభారతి క్షేత్ర బాలిక విద్య సహ సంయోజిక) ముఖ్య వక్త: శ్రీ వెంకట నివాస్ (ప్రాంత గోసేవ ప్రముఖ్ సంఘ ప్రచారక్) పాల్గొంటారని కనుకా ప్రతి హిందూ బంధువు “గడప లోపల కులం, గడప దాటితే హిందువులం ప్రియ బంధువులం” అనే నినాదంతో ప్రతి గ్రామానికి వెళ్లి కార్యక్రమం గురించి వివరించడం జరుగుతున్నదని వారు తెలిపారు. కనుక ప్రతి హిందువు తమ కుటుంబ సమేతంగా వచ్చి పాల్గొని మన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెల్‌చాల్ ఉపమండలం హిందూ సమ్మేళన సమితి తెలిపారు.



చత్రపతి శివాజీ,భారత్ మాత,శ్రీరాముని ఫైల్ ఫొటోలు.



నందిగామ గ్రామపంచాయతీ 11వ వార్డులో మిషన్ భగీరథ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

## మంచినీటి కష్టాలు రానివ్వం

**మిషన్ భగీరథ పైప్ లైన్ పనులు ప్రారంభించిన సర్పంచ్ కొమ్ము కృష్ణ**

**నందిగామ, మే 18, ప్రభాతవార్త :** వేసవికాలంలో ప్రజలకు మంచినీటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ కొమ్ము కృష్ణ అన్నారు. సోమవారం నందిగామ గ్రామపంచాయతీ 11 వవార్డులో మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చంద్రపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, వార్డ్ సభ్యులు అగ్గిప్రసాద్, శివగల్ల సురేష్, టైలర్ కృష్ణ, నాయకులు చించేటి కృష్ణగౌడ్, బి జంగయ్య గౌడ్, చిన్ చోటి శివ గౌడ్, గంగిశెట్టి మురళి, బొమ్మ గళ్ళ లింగం, నరేందర్ రెడ్డి, తడకల జంగయ్య తదితరులు ఉన్నారు.



సిడి తండా మహిళా సమాఖ్య భవనం స్లాప్ పనులు ప్రారంభిస్తున్న నాయకులు.

## మహిళా సమైక్య భవన్ స్లాబ్ పనులు ప్రారంభం

**నందిగామ, మే 18, ప్రభాతవార్త:** నందిగామ మండలం సిడి త్నాడ గ్రామపంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూ.10 లక్షలతో నిర్మిస్తున్న మహిళ సమైక్య భవన నిర్మాణ స్లాబ్ పనులను సోమవారం సర్పంచ్ గబ్రు చౌహాన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎం రవీందర్ నాయక్, వార్డు సభ్యులు, పారిశుధ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



కళ్యాణ లక్ష్మీ చెక్కులను అందజేస్తున్న నాయకులు

**దుద్యాల్, మే 18, ప్రభాతవార్త:** మండలంలోని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు అధికారులు చెక్కులు పంపిణీ చేశారు. 58 కళ్యాణ లక్ష్మి 3 షాదీ ముబారక్ లకు సంబంధించిన 61,07,076/ రూ. ల 61 చెక్కులను పంపిణీ చేసినట్లు తెలి పారు. కార్య క్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, కాం గ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్య దర్శి మేర్గు వెంకట య్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, రవీందర్ వివిధ గ్రామాల సర్పంచ్ లు సంగీత వాణి, లాలప్ప, నరేష్, మాణిక్య నాయక్, మొగులయ్య, కథలయ్య, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులుపాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**షాబాద్, మే 18, ప్రభాతవార్త :** మండలంలో మంగళవారం మధ్యాహ్నం 2 గం.ల నుండి సాయంత్రం 5 గం. ల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్కో ఎఇ జీ. వీ. కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. షాబాద్ గ్రామంలో 33కేవీ కొత్త ఫీడర్ ఏర్పాటు సందర్భంగా విద్యుత్ సరఫరా కు అంతరాయం ఉంటుందని ఈ విషయాన్ని రైతులు వినియోగదారులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు